
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
శనివారం 20 జూలై 2024



శాసనసభలో ఆమోదించిన

# 14 బిల్లులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్



గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముగిసిన రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. శాసనసభలో చేసే చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఈ బిల్లులన్నీ చట్టాలుగా మారుతాయి. అయితే గత కొన్నేళ్లుగా శాసనసభలో ఆమోదించిన కొన్ని చట్ట సవరణ బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచటం, తగిన వివరాలను జతచేయాలంటూ వాటిని పాలకులకే తిప్పింపడం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. దీంతో గవర్నర్‌కు డీఎంకే ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు, గవర్నర్ రవికి మధ్య మనస్పర్థలు కూడా ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులలో ఇటీవల గవర్నర్ వైఖరిలో కాస్త మార్పు వచ్చిందని అందరూ భావించేలా కళ్లకుర్చి కల్తీసారా సంఘటన నేపథ్యంలో ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన కల్తీసారా నిరోధక చట్ట సవరణ బిల్లును వెంటనే ఆమోదించారు. గత నెల జరిగిన శాసనసభలో ఆమోదించిన కీలకమైన 14 చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ శుక్రవారం ఆమోదం తెలిపారు. పుదుకోట, తిరువణ్ణామలై, నామక్కల్, కారైక్కుడి మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా స్థాయి పెంచే బిల్లును, గ్రామ పంచాయతీ, పంచాయతీ యూనియన్లను నగర పంచాయతీలో విలీనం చేసేటప్పుడు ఆయా ప్రాంతాల్లో ఆస్తుల బదిలీకి సంబంధించిన బిల్లు, చెన్నై నగరంలో ప్రైవేటు వాణిజ్య సముదాయాలు డ్రైనేజీకి దగ్గరగా 30 మీటర్ల దూరంలో ఉంటే తప్పనిసరిగా ఆ డ్రైనేజీలో మురుగునీటిని విడిచి పెట్టేలా తగిన అనుమతి పొందాలనే చట్ట సవరణ బిల్లు, గ్రేటర్ చెన్నై పోలీసు చట్టాలన్నీ మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, జేలం, తిరునల్వేలి, తిరుప్పూరు నగరాలకు విస్తరింపజేసే చట్టసవరణ బిల్లు సహా 14 బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. గవర్నర్ ఇలా ఒకేసారి 14 చట్టసవరణ బిల్లులను ఆమోదించటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సీఎంతో సీనియర్ మంత్రుల భేటీ

● మంత్రివర్గ విస్తరణ కోసమా? లేక అసెంబ్లీ ఎన్నికల వ్యూహామా ?

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పదిమంది సీనియర్ మంత్రులు భేటీ అయ్యారు. దీనిపై రకరకాల ఊహాగానాలు రేగుతున్నాయి. త్వరలో మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్న స్టాలిన్.. దీనిపై సీనియర్లతో చర్చించేందుకా? లేక రెండేళ్లలో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికల వ్యూహం కోసమా అన్నదానిపై అన్ని వర్గాలు చర్చించుకుంటున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధికి పదోన్నతి లభించనుందని, ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టనున్నారని తెలుస్తోంది. నిజానికి ఉదయనిధిని ఉపముఖ్యమంత్రిగా నియమించనున్నారంటూ ఆరు నెలల క్రితమే ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయమై పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పదిమంది మంత్రులతో చర్చించినట్లు సమాచారం. స్టాలిన్‌లాగే ఉదయనిధి కూడా పార్టీ యువజన విభాగానికే కాకుండా ఎన్నికల ప్రచార సమయాల్లోను ఎనలేని సేవలందించటంతో ఆయనకు డిప్యూటీ సీఎం పదవినిస్తే పార్టీలో ఎలాంటి విభేదాలు రావని మంత్రులు స్టాలిన్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం గుట్టు చప్పుడు కాకుండా స్టాలిన్ నివాసంలో జరిగింది. అదే సమయంలో కొత్త వ్యూహరచనలతో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనే విషయంపై కూడా స్టాలిన్ ఆ మంత్రుల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం. స్టాలిన్ నాయకత్వంలో ఆ పార్టీ పాలన నాలుగోయేట అడుగిడిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో సాధించినట్లే అసెంబ్లీ ఎన్నికల్లోనూ 200 సీట్లకు పైగా గెలవాలని స్టాలిన్, మంత్రులు వ్యూహరచన చేస్తున్నారని వినికిడి, కాగా విక్రవాండి ఉప ఎన్నికల్లో స్టాలిన్ ప్రచారానికి వెళ్లకపోయినా, ఉదయనిధి అక్కడ అన్నీ తానై పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని ఆ మంత్రులు ప్రశంసించారు. ఈ పరిస్థితుల్లో ఆగస్టు 22న ముఖ్యమంత్రి స్టాలిన్ విదేశీ పెట్టుబడుల సమీకరణ దిశగా అమెరికా వెళ్లనున్నారు. అమెరికా వెళ్ళడటానికి ముందే రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేయనున్నారని కూడా తెలిపారు. ఇటీవల స్టాలిన్ అల్లుడు శబరీషన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులంతా ఈ సారి మంత్రివర్గ మార్పుల సమయంలో ఉదయనిధి డిప్యూటీ సీఎం కావటం ఖాయమని బహిరంగంగా ప్రకటించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే ఆగస్టు మొదటివారంలో మంత్రివర్గంలో మార్పులుచేర్పులుంటాయని, అదే సమయంలో ఉదయనిధి డిప్యూటీ సీఎం కావటం తథ్యమని పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు.

## అమ్మా క్యాంటీన్‌లో సీఎం స్టాలిన్ ఆకస్మిక తనిఖీ



చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని అమ్మా క్యాంటీన్‌లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న యువకులతో మాట్లాడి ఇడ్లీలు, పొంగలి, సాంబారు శుచిగా రుచిగా ఉన్నాయా అని అడిగారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో వంటగదిని పరిశీలించారు. కొత్త వంట పాత్రలు సమకూర్చాలని అక్కడి కోరడంతో కొత్త వంట పాత్రలను సమకూర్చాలని పక్కనే వున్న చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమరగురుబరన్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అమ్మా క్యాంటీన్లను తమ ప్రభుత్వం కూడా చక్కగా నిర్వహిస్తోందని చెప్పారు. నగరంలో ఏడు ప్రభుత్వ ఆసుపత్రులు, 388 చోట్ల అమ్మా క్యాంటీన్లు నడుపుతున్నారని, ఈ క్యాంటీన్లను మరింత మెరుగుపరిచేందుకు రూ.21 కోట్ల మేర నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. ఈ అమ్మా క్యాంటీన్లు ప్రతియేటా సుమారు నాలుగు కోట్ల మంది ఆకలి తీరుస్తున్నాయన్నారు. 2021 మే నుంచి ఇప్పటివరకు చెన్నై కార్పొరేషన్ సుమారు రూ.400 కోట్లను, బియ్యం, గోధుమల కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.69కోట్లను కలుపుకుని మొత్తం రూ. 469 కోట్లతో ఈ క్యాంటీన్లను నడుపుతోందని వివరించారు. ఈ క్యాంటీన్లకు కొత్త వంట పాత్రలను సమకూర్చేందుకు రూ.7 కోట్లు కేటాయించామన్నారు. అమ్మా క్యాంటీన్ల పనితీరును మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు తరచూ తనిఖీ చేయాలని ఆదేశించినట్లు సీఎం పేర్కొన్నారు.

# త్వరలో కోవై-మేట్టుపాళయం మధ్య జంట రైలుమార్గం

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్



మేట్టుపాళయం-తూత్తుకుడి రైలు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మురుగన్

ప్యారీస్, జూలై 19: కోవై-మేట్టుపాళయం మధ్య త్వరలో జంట రైలు మార్గం నిర్మాణం పథకాన్ని అమలుపరచనున్నట్లు కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. మేట్టుపాళయం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మురుగన్ మేట్టుపాళయం-తూత్తుకుడి మధ్య కొత్త రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మేట్టుపాళయం-కోవై మధ్య నడుపుతున్న ప్యాసింజర్ పోతనూరు వరకు పొడిగించామని, కోవై-తిరుపతి మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ సామలపట్టిలో స్టాపింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మేట్టుపాళయంను దేశంలోనే ఆదర్శంగా అభివృద్ధి పరిచేందుకు రైల్వే శాఖ రూ.40 కోట్లు కేటాయించిందని తెలిపారు. తమిళనాడుకు సంబంధించిన రైల్వే పథకాలకు ప్రధాని మోదీ గత ఏడాది మాత్రమే రూ.6,000 కోట్లు కేటాయించారని, 9 కొత్త రైలుమార్గాలు కూడా తీసుకొచ్చారన్నారు.

రూ.264 కోట్లతో

# తరగతి గదులు, భవనాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్




విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.264.15 కోట్లతో నిర్మించిన 956 తరగతి గదులు, విద్యాశాఖ భవనాలు, పునర్నించిన పాఠశాల భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్బళగన్ విద్యాభివృద్ధి పథకం కింద పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.113.29 కోట్లతో 26 జిల్లాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మహోన్నత పాఠశాలల్లో నిర్మించిన 515 తరగతి గదులు, 12 ప్రయోగశాల భవనాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా ప్రాథమిక విద్యా సంస్థ ఆధ్వర్యంలోని ప్రాథమిక, మాధ్యమికపాఠశాలల గ్రామీణాభివృద్ధి శాఖ తరపున రూ.68.66కోట్లతో 25 జిల్లాల్లోని 176 ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలల్లో నిర్మించిన 441 తరగతి గదుల భవనాలకు కూడా స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. 28 జిల్లాల్లో 28 ఆదర్శ పాఠశాల్లో రూ.61.70 కోట్లతో పునర్నిర్మించిన పాఠశాల భవనాలు, తిరువణ్ణామలైలో రూ.19.50 కోట్లతో నిర్మించిన మీటింగ్ హాల్స్, కార్యాలయ గదులు, వీడియో కాన్ఫరెన్స్ హాళ్లు, రెండంతస్థుల్లో నిర్మించిన ప్రాథమిక విద్యా సంచాలకుల కార్యాలయ భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి, సమగ్ర విద్య రాష్ట్ర ప్రణాళిక విభాగం సంచాలకులు డాక్టర్ ఎం.ఆరతి, పాఠశాలల విద్యాశాఖ సంచాలకులు ఎస్.కన్నప్పన్, ప్రాథమిక విద్యావిభాగం సంచాలకులు పీఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### జైళ్లశాఖ భవనాల ప్రారంభోత్సవం..

సచివాలయంలో జైళ్లు, సంస్కరణల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆ శాఖకు సంబంధించి రూ.9.45 కోట్లతో నిర్మించిన కొత్త భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. విల్లుపురం జిల్లా దిండివనంలో రూ.8.39 కోట్లతో నిర్మించిన సబ్ జైలు భవనానికి, చెంగల్పట్టులోని జిల్లా జైలులో రూ.1.6 కోట్లతో నిర్మించిన అదనపు భవనానికి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. ఎక్సైజ్ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మన్ ఏకే విశ్వనాధన్, జైళ్లశాఖ ప్రధాన సంచాలకులు మహేశ్వర్ దయాళ్ పాల్గొన్నారు.

### 8 మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లు...

ఆదిద్రావిడ గిరిజనుల సంక్షేమశాఖ నడుపుతున్న వసతి గృహాల్లో, పాఠశాలల్లో చదివి 'నాన్ ముదల్వన్' పథకం ద్వారా శిక్షణ పొంది, జేఈఈ, క్లాట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పొందిన ఎనిమిదిమంది విద్యార్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసాపత్రాలు, లాప్‌టాప్‌లను అందజేశారు. సచివాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్‌లో సీటు సంపాదించుకున్న విరుదునగర్ జిల్లా రాజపాళయం విద్యార్థి సి.పార్థసారథి, తిరుచ్చి ఎన్ఐటీలో అడ్మిషన్లు పొందిన సేలం జిల్లా కరియకోవిల్‌వలైవు పాఠశాల విద్యార్థిని ఎల్.సుకన్య, తిరుచ్చి జిల్లా చిన్న ఇలరుప్పూరు పాఠశాల విద్యార్థిని ఎం.రోహిణి, తమిళనాడు నేషనల్ లా యూనివర్శిటీలో సీటు సంపాదించుకున్న నీలగిరి జిల్లా ఎం.పాలాడా ఏకలవ్య మోడల్ స్కూలు విద్యార్థి ఎ.అజయ్, తరమణి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో ప్రవేశం పొందిన తిరువణ్ణామలై జిల్లా పులియంపట్టి ఏకలవ్య మోడల్ స్కూలు విద్యార్థినులు కే మీనా, ఎస్.దుర్గా, కళ్లకుర్చి జిల్లా మణియార్‌పాళయం ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని పళనియమ్మాళ్, విద్యార్థి కే తవమణికి ఆయన ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, ఆదిద్రావిడ, గిరిజనుల సంక్షేమ శాఖ కార్యదర్శి లక్ష్మీప్రియ, అదిద్రావిడ సంక్షేమ శాఖ సంచాలకులు డి.ఆనంద్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.అన్నాదురై పాల్గొన్నారు.



ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినికి లాప్‌టాప్ అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



పుష్పా నగర్ దేవి కరుమారియమ్మన్ ఆలయంలో ఆడి తొలి శుక్రవారం ఊరేగింపు

# భక్తిశ్రద్ధలతో ఆడి శుక్రవార పూజలు

ప్యారీస్, జూలై 19: రాష్ట్రవ్యాప్తంగా ఆడి తొలి శుక్రవారం పూజలను అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళ మాసంలో జరుపుకొనే పండుగల్లో ప్రధానమైన ఆడి మాసంలో నెల రోజులు అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణ, అభిషేకాలు నిర్వహిస్తారు. ముత్తయిదువులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవార్లను ప్రార్థిస్తూ ప్రతివారం ఉపవాసం చేస్తారు. ఈ క్రమంలో, ఈ ఏడాది ఆడి తొలి శుక్రవారం సందర్భంగా రాజధాని నగరం, చెంగల్పట్టు, కాంచీపురం, విల్లుపురం జిల్లాలు సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమ్మవారి ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల కలశాలు, అంబలి పాత్రలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. నుంగంబాక్కం పుష్పా నగర్ శ్రీ దేవి కరుమారియమ్మన్ ఆలయానికి 1,008 పాల కలశాలతో మహిళలు ఆలయ నిర్వాహకులతో కలసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి క్షీరాభిషేకం, అర్చన చేశారు. మైలాపూర్‌లోని ముండకన్నియమ్మన్ ఆలయ ప్రాంగణంలోని నాగదేవతల విగ్రహాలకు మహిళలు పూజలు చేశారు. తిరువేర్కాడు శ్రీ దేవి కరుమారియమ్మ ఆలయం, మాంగాడు కామాక్షి ఆలయం, తిరువొత్తియూర్ వడివుడయమ్మన్ ఆలయం, ప్యారీస్ కాళికాంబ ఆలయం, బీసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయం, చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి పీఠంలో పూజలు చేశారు. అలాగే, తిరుచ్చి సమీపంలోని తిరువనైకావల్ ఆలయంలో అఖిలాండేశ్వరి, సమయపురంలో మారియమ్మ, ఉరువు కాళియమ్మ, పుదుకోట ముత్తుమారియమ్మ, శివగంగ జిల్లా త్రిభువనంలోని భద్రకాళి అమ్మ సహా ఇతర జిల్లాల్లో ప్రసిద్ధిచెందిన అమ్మవారి ఆలయాల్లో ఆడి తొలి శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పాల కలశాల ఊరేగింపు సందర్భంగా వాహనాలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు



క్షీర కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ప్రయాణికులు లేక

# నాలుగు విమానాల రద్దు

ప్యారీస్, జూలై 19: స్థానిక మీనంబాక్కంలోని స్వదేశీ విమానాశ్రయంలో శుక్రవారం ప్రయాణికులు లేని కారణంగా నాలుగు విమానాలు రద్దయ్యాయి. ఇక్కడి నుంచి అయోధ్యకు ప్రతిరోజు విమానాలు నడుపుతున్నారు. అయితే శుక్రవారం ఉదయం 8.35 గంటలకు అయోధ్యకు వెళ్లాల్సిన ఓ ప్రైవేటు విమానం, రాత్రి 8.55 గంటలకు ఢిల్లీ వెళ్లాల్సిన ప్రైవేటు ఎయిర్‌లైన్స్ విమానాలు రద్దు చేశారు. ఢిల్లీ నుంచి ఉదయం 8.05 గంటలకు నగరానికి రావల్సిన విమానం, అయోధ్య నుంచి రాత్రి 8.55 గంటలకు రావాల్సిన మరో విమానం మొత్తం నాలుగు విమాన సేవలు రద్దయ్యాయి. తగినంత మంది ప్రయాణికులు లేనందువల్లే ఒకరోజు మాత్రమే విమాన సేవలు రద్దుచేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, రద్దయిన విమానాల్లో ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులను ఇతర విమానాల్లోను, మరికొందరిని మరో తేదీకి ప్రయాణం మార్చుకోవాల్సిందిగా అధికారులు సూచించారు.

# హత్యల నగరంగా చెన్నై

● ఎడప్పాడి ధ్వజం



ప్యారీస్, జూలై 19: రాష్ట్ర రాజధాని ప్రాంతమైన చెన్నై హత్యల నగరంగా మారిందని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు హత్యలు, హత్యాయత్నం కేసులు నమోదవుతున్నాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... మూడేళ్ల డీఎంకే పాలనలో సంఘ విద్రోహుల ఆగడాలు పెరిగాయని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో మళ్లీ దాడులు, విధ్వంస చర్యలు తలెత్తాయని ఆరోపించారు. తమ పాలనలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదని ముఖ్యమంత్రి స్టాలిన్ పదేపదే చెబుతున్నారని, ప్రతిపక్షనేతగా తాను పలుమార్లు శాంతి భద్రతల సమస్యల గురించి మాట్లాడినా ప్రభుత్వం కానీ, పోలీసు శాఖ కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పోలీసులకు స్వేచ్ఛ లేని కారణంగా ప్రతిరోజూ అన్ని జిల్లాల్లో ఏదో ఒక ప్రాంతంలో హత్యా సంఘటనలు నమోదవుతున్నాయని,, ఇప్పటివరకు జరిగిన హత్యకేసుల్లో అసలైన నిందితులు జాడ తెలుసుకోలేకపోయారన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో కూడా నిందితులు తాముగానే లొంగిపోయారని, అందులో ఒకరిని ఎన్‌కౌంటర్ చేయడం వింతగా ఉందన్నారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చాక రాజధాని హత్యా నగరంగా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఎన్ని హత్యలు జరిగినా అసలైన నిందుతుల ఆచూకీని పోలీసులు ఇప్పటివరకు తెలుసుకోలేదని, వాటికి గల కారణాలపై పాలకులు ఆరా తీసి నేరాలు అదుపుచేసేలా ఇప్పటికైనా పటిష్ట చర్యలు చేపట్టాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

## సమాచార దర్శిని

### లాసెట్‌కు దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్, జూలై 19: లా ప్రవేశ పరీక్షకు అక్టోబరు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. దేశంలో 24 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిల్లో యూజీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష డిసెంబరు 1వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనుంది. ఈ పరీక్షకు అక్టోబరు 15వ తేదీలోపు Consortiumofnlus.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### కూవం తీరంలో 'రివర్ వాక్' పార్క్

ఐసిఎఫ్, జూలై 19: అమెరికా శాన్ ఆంటోనియాలో వున్న 'రివర్‌వాక్' పార్కు తరహాలోనే కూవం నదీ తీరంలో మార్పులు చేయనున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. తమిళ సంస్కృతి ప్రతిబింబించేలా శాన్ ఆంటోనియా తరహాలోనే విగ్రహాలు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అలాగే అక్కడున్న రివర్ వాక్ పార్కులాగే కూవం నది తీరంలో ఒక పార్కు ఏర్పాటు చేస్తామని వివరించారు.

### గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

ఐసిఎఫ్, జూలై 19: తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. పౌర్ణమి నాడు అణ్ణామలయార్ దర్శనానంతరం భక్తులు గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఆడి మాసం పౌర్ణమి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6.10 నుంచి 21వ తేదీ సాయంత్రం 4.51 గంటల వరకు ఉంటుంది. ఆ సమయం గిరి ప్రదక్షిణకు అనుకూల సమయమని వివరించారు.

### 22న ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

ఐసిఎఫ్, జూలై 19: ఇంజనీరింగ్ కోర్సులకు ఈ నెల 22వ తేదీన కౌన్సిలింగ్ జరుగనుంది. ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులైన 1, 99,868 మంది జాబితా విడుదలైన విషయం తెలిసిందే. వీరికి కౌన్సెలింగ్ 22 నుంచి సెప్టెంబరు 11వ తేదీ వరకు జరుగనుందని రాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్ కార్యాలయం ప్రకటించింది.

### రూ.25.75 కోట్లతో ఫుట్‌పాత్‌లు

ఐసిఎఫ్, జూలై 19: రాయపురం, తేనాంపేటసహా 15 ప్రాంతాల్లో రూ.25.75 కోట్లతో ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నట్లు చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు. బీసెంట్‌నగర్‌లో 8 కి.మీ మేర ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. ఆ ప్రకారం అందరూ తండయార్‌పేట, తేనాంపేట, రాయపురంసహా 15ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు కానున్నాయి. దానికోసం టెండర్లు ఆగస్టు 9న ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

### కొచ్చువేలి - బరౌనీ మధ్య ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, జూలై 19: కేరళ రాష్ట్రం కొచ్చువేల నుంచి బిహార్ రాష్ట్ర బరౌనీకి శనివారం ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. కొచ్చువేలి నుంచి శనివారం రాత్రి 8గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు (నెంబరు.06091)ఎర్నాకుళం, తిరుచ్చూర్, పాలక్కాడు, కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్డు, సేలం, జోలార్‌పేట, కాట్పాడి,పెరంబూర్,గూడూరు, విజయవాడ, సంబల్‌పూర్, రాంచీ, ధనబాద్ మీదుగా సోమవారం మధ్యాహ్నం బరౌనీ చేరుకుంటుంది.తిరిగి ఇదేరైలు(నెంబరు.06092) మంగళవారం రాత్రి11.30 గంటలకు బరౌనీలో బయలుదేరి గురువారం రాత్రి 7.55గంటలకు పెరంబూరుకు, శుక్రవారం వేకువజామున 4.25గంటలకు కోయంబత్తూరుకు, అదేరోజు మధ్యాహ్నం1.30గంటలకు కొచ్చువేలి చేరుకుంటుంది.

### రూ.200 కోట్లతో మేథో నగరం

ఐసిఎఫ్, జూలై19: తిరువళ్లూరు సమీపంలో రూ.200 కోట్లతో మేథోనగరం ఏర్పాటు కానుంది. ఈ జిల్లాలో మేథో నగరాన్ని నిర్మించనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.ఆ ప్రకారం మేల్‌మాణిక్యపట్టులో 17 ఎకరాల్లో రూ.200 కోట్లతో మేథో నగరం ఏర్పాటు కానుంది. దీనిపై ఎవరికైనా ఆక్షేపణలుంటే జిల్లా రెవెన్యూ అధికారి వద్ద ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

### ల్యాబ్ అసిస్టెంట్‌కు 'ఎమిస్' పనులు

ఐసిఎఫ్, జూలై 19: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు భారంగా మారిన 'ఎమిస్' ఇంటర్నెట్ పనులను ల్యాబ్ అసిస్టెంట్లకు కేటాయిస్తూ విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, విద్యాశాఖ పథకాల వివరాలను ఎమిస్ ద్వారా పరిరక్షిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో వున్న ఈ ఎమిస్ వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయులే నమోదు చేస్తున్నారు. దీని వలన బోధనకు అంతరాయం కలుగుతోందని, దీని నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎమిస్ పనులను ల్యాబ్ అసిస్టెంట్లకు విద్యాశాఖ అప్పగించింది.

### రికార్డు స్థాయిలో గొర్రెలు, మేకల విక్రయాలు

ఐసిఎఫ్, జూలై 19: దిండుగల్ జిల్లా అయ్యలూరు సంతలో గొర్రెలు, మేకల విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆడిమాసంలో గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో జంతుబలి నిర్వహించడం ఆనవాయితీ. ఆడి మాసాన్ని పురస్కరించుకుని అయ్యలూరు వారాంతపు సంతలో గురువారం వ్యాపారులు, రైతులనుంచి పోటీపడి మేకలు, గొర్రెలు, కోళ్లను కొనుగోలు చేశారు. 10 కిలోల బరువున్న గొర్రె రూ.8వేల నుంచి, మేకలు, రూ.7,500 నుంచి ధర పలికాయి. దీంతో కోటిరూపాయల మేరకు వ్యాపారం జరిగినట్టు నిర్వాహకులు తెలిపారు.

### కొత్త బీమా పథకం

ఐసిఎఫ్, జూలై 19: తపాలా శాఖలో కొత్త బీమా పథకం పరిచయం చేశారు. ఈ శాఖ ఆధ్వర్యంలోని 'ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, ప్రజా బీమా సంస్థలతో కలిపి ఏడాదికి రూ.520, రూ.555, రూ.755 ప్రీమియం చెల్లించే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం పొందే ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో 18 నుంచి 65 ఏళ్లలోపున్న వారు మాత్రమే చేరాలి. దరఖాస్తు ఫారం, గుర్తింపు కార్డులు వంటి ఎలాంటి కాగితాన్ని వినియోగించకుండా పోస్టు మ్యాన్ తీసుకొని వచ్చే స్మార్ట్ ఫోన్, బయో మెట్రిక్ పరికరాలను ఉపయోగించి ఐదు నిమిషాల్లో ఈ పాలసీ అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఏడాదికి ఒకసారి ఫుల్ హెల్త్ చెకప్ చేయించుకోవచ్చు. ఫోన్ ద్వారా వైద్య సలహాలు పొందవచ్చని అధికారులు తెలిపారు.

### 31 వరకు మాజీ మంత్రికి రిమాండ్

ప్యారీస్, జూలై 19: భూకబ్జా కేసులో అరెస్టయిన మాజీ మంత్రి విజయభాస్కర్‌ను ఈ నెల 31వ తేది వరకు కరూర్ న్యాయస్థానం రిమాండ్ విధించింది. కరూర్ జిల్లా వాంగల్ కుప్పిచ్చిపాళయానికి చెందిన ప్రకాష్ తన రూ.100 కోట్ల విలువైన 22 ఎకరాలను మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్, ఆయన మద్దతుదారులు నకిలీ పత్రాలు సృష్టించి దోచుకున్నారని ఫిర్యాదుచేశారు. ఈ కేసులో అరెస్టయిన విజయభాస్కర్‌ను శుక్రవారం కరూర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి మహేష్ విచారణ అనంతరం 31వ తేది వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయనను తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

# ఏడీఏఐ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏస్తటిక్ డెంటిస్ట్రీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏడీఏఐ) ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ఇటీవల సవీత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమట్స్)లో జరిగింది. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దిబ్యేందు మజుందార్, సిమట్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్, ప్రొ ఛాన్సలర్ డాక్టర్ దీపక్ నల్లస్వామి వీరయ్యన్, ఏడీఏఐ అధ్యక్షుడు డాక్టర్ మిత్రా హెగ్డే, కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ మోహన్‌కుమార్ తదితరులు ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి 530 మంది ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో 174 శాస్త్రీయ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ రంగంలో తాజా పురోగతి, పరిశోధనలు, దంతవైద్యంలో సౌందర్య సాధన వంటివాటిపై ఈ సదస్సులో చర్చించారు.



సదస్సులో వైద్య నిపుణులు

# కుమరిలో నగల చోరీ

**ముసుగు దొంగల కోసం పోలీసుల గాలింపు**

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా వియ్యన్నూరులోని ఓ ఇంట్లోకి జొరబడిన ఇద్దరు ముసుగు దొంగలు.. యజమానిపై దాడి చేసి 200 సవర్ల బంగారు నగలు, రూ.50వేల నగదు దోచుకెళ్లారు. వారి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వియ్యన్నూరుకు చెందిన మోహన్‌దాస్ (60) పెట్రోల్ బ్యాంకు నడుపుతూ, వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. ఆయన భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇద్దరు కుమార్తెలు చెన్నైలో మెడిసిన్ చదువుతున్నారు. చిన్న కుమార్తె అక్షయ (23) ఇటీవలే ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లోకి జొరబడిన ఇద్దరు ముసుగు దొంగలు మోహన్‌దాస్‌పై తీవ్రంగా దాడి చేశారు. అక్షయను కత్తితో బెదిరించి, బీరువాలో వున్న 200 సవర్ల నగలు, రూ.50 వేల నగదు తీసుకుని పారిపోయారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటికి రంగులు వేసేందుకు సిద్ధం చేసిన నిచ్చెన పైనుంచే దొంగలు లోనికి జొరబడినట్లు పోలీసులు గ్రహించారు. పక్కా ప్రణాళికతో ఇలా నిచ్చెన పెట్టారా? అనుకోకుండా జరిగిందా అన్నదానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మోహన్‌దాస్ ఇంటి గురించి బాగా తెలిసినవారే ఈ చోరీకి పాల్పడివుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

### హమ్మయ్య... 3 కిలోల బంగారు బిస్కెట్లు తాకలే

బీరువాలో వున్న 100 సవర్ల బంగారు నగల్ని దోచుకెళ్లిన దొంగలు.. ఆ పక్కనే వున్న 3 కిలోల బంగారు బిస్కెట్లను గమనించకపోవడంతో యజమాని ఊపిరి పీల్చుకున్నారు. వ్యాపారం నిమిత్తం ఇటీవలే తీసుకొచ్చిన బంగారు బిస్కెట్లను సిల్వర్‌టేపులో చుట్టి, బీరువా పక్కనే పెట్టారు. కానీ దొంగలు దానిని గమనించకపోవడంతో అవి అక్కడే వుండిపోయాయి. అయితే ఆ బంగారు బిస్కెట్ల కొనుగోలుకు సంబంధించి మోహన్‌దాస్ తగిన అనుమతి పొందాడా? అంత బంగారం అతను ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందన్న దానిపై పోలీసులు, ఐటీ వర్గాలు ఆరా తీస్తున్నాయి.

### రాణిపేట జిల్లా కలెక్టర్‌గా చంద్రకళ



వేలూరు, జూలై 19: రాణిపేట జిల్లా కలెక్టర్‌గా జేయూ చంద్రకళ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయంలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన వివరాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారి సురేష్, కలెక్టర్ పీఏ (జనరల్) రాఘవన్, ఆఫీసు మేనేజర్ బాబు తదితరులున్నారు.

### గ్యాస్ పైప్‌లైన్ పాయింట్ పేలి వృద్ధురాలికి గాయాలు



గ్యాస్ పైప్‌లైన్ చెకింగ్ పాయింట్ పరికరం పేలిన చోట పరిశీలిస్తున్న పోలీసులు. ఇన్‌సెట్‌లో గాయపడిన

చెన్నై, జూలై19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు వావిపాళయం సమీపంలో శుక్రవారం ఉదయం ప్రైవేటు గ్యాస్‌పైప్‌లైన్ చెకింగ్ పాయింట్ పరికరం పేలడంతో ఓ వృద్ధురాలికి గాయమైంది. వావిపాళయంలోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ రెసిడెన్షియల్ క్వార్టర్స్ వద్ద సుందరమ్మాళ్ (56) మొక్కలకు నీరుపోస్తుండగా ఎక్కడి నుంచో పెద్ద శబ్దంతో ఇనుప గుండు వంటి పరికరం వేగంగా వచ్చి ఆమె కాలిపై పడింది. దీంతో ఆమె కాలికి గాయం కావటంతో కేకలు పెట్టింది. చుట్టుపక్కలవారు వెళ్ళి వృద్ధురాలి కాలి వద్ద ఎడిఉన్న పరికరాన్ని చూసి దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తిరుమురుగన్ పూండి పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని సీసీ కెమెరాలో నమోదైన దశ్యాలు పరిశీలించగా, ఆ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌కు సమీపంలో ప్రైవేటు సంస్థ భూమిలో ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్‌లైన్ చెకింగ్ పాయింట్ వద్ద గ్యాస్ ఒత్తిడి అధికమై ఉన్నట్టుండి చెకింగ్ పాయింట్ పరికరం విడిపోయి ఎగిరి ఆ వృద్ధురాలిపై పడినట్లు గుర్తించారు. గాయపడిన వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించి, గ్యాస్ పైప్‌లైన్ ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు.

### స్వదేశీ విమాన పర్యాటక టూర్లు

● వెల్లడించిన ఐఆర్‌సీటీసీ

ప్యారీస్, జూలై 19: దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలను, ప్రముఖ పర్యాటక ప్రాంతాలను తిలకించేలా స్వదేశీ విమాన పర్యాటక టూర్ చేపట్టనున్నట్టు ఐఆర్‌సీటీసీ గ్రూపు జనరల్ మేనేజర్ పి.రాజలింగం బసు వెల్లడించారు. శుక్రవారం చెన్నై ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత యేడాది దేశ వ్యాప్తంగా ఐఆర్‌సీటీసీ దేశీయ టూర్ ప్యాకేజీలు విజయవంతంగా నిర్వహించగా, దేశవ్యాప్తంగా ప్రజల నుంచి ఆదరణ లభించిందన్నారు. 2024-25 సంవత్సరంలో కశ్మీర్, లేహ్-లడఖ్, సిమ్లా - మనాలి, డార్జిలింగ్ - గ్యాంగ్‌టక్, అండమాన్ - వైష్ణోదేవి, కొల్లూరు - మూకాంబికై తదితర ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సుమారు 70 దేశీయ పర్యటనలు నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలిపారు. 'ఆప్నా దేఖో దేశ్' పేరుతో అమవాస్య సందర్భంగా చెన్నై, మదురై, తిరుచ్చి తదితర ప్రాంతాల నుంచి నెలవారీ టూర్ ప్యాకేజీలను నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా రైల్ టూర్ ప్యాకేజీ కింద దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన ఊటీ, కొడైకెనాల్, మదురై, రామేశ్వరం, కన్నియాకుమారి, బోడి, త్రివేండ్రం, మూనార్, తేక్కడి ప్రాంతాలతో పాటు నవగ్రహ స్థలాలు, శబరిమలై ప్రాంతాలకు రైల్ టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే, చార్‌ధామ్ ప్యాకేజీ కింద హరిద్వార్, రిషికేశ్, కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి వంటి ఆధ్యాత్మిక కేంద్రాలకు సెప్టెంబరు 15వ తేదీ ఆధ్యాత్మిక పర్యాటక యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్రకు వచ్చే పర్యాటకులకు భారతీయ ఆహారాన్ని అందిస్తామన్నారు. అమావాస్య సందర్భంగా ఆగస్టు 3, సెప్టెంబరు, అక్టోబరు ఒకటో తేదీ, 2025 జనవరి 28, మార్చి 28వ తేదీలో ఆధ్యాత్మిక స్థలాలకు టూర్లు ఏర్పాటు చేశామని, పూర్తి వివరాల కోసం 044-28362430, 90031 40682 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

### కేంద్ర వైఖరికి నిరసనగా జాలర్ల ఆందోళన

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు

అడయార్, జూలై 19: భారత సముద్ర జలాల్లో చేపలవేటకు వెళ్లే తమిళ జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేయడం, ఈ విషయంలో కేంద్ర మెతక వైఖరి అవలంభించడాన్ని ఖండిస్తూ జాలర్లు ఆందోళన చేశారు. శుక్రవారం రామేశ్వరంలో జరిగిన ఆందోళనలో జాలర్లు, వారి కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీల, రాజకీయ నేతలు పాల్గొన్నారు. రామేశ్వరం తీరంలో చేపల వేటకు వెళ్ళే రాష్ట్రానికి చెందిన జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్టు చేస్తోంది. గత నెల రోజుల్లో ఏకంగా 74 మంది జాలర్లను ఖైదు చేసి, వారి నుంచి 8 మరబోట్లను స్వాధీనం చేసుకుంది.గత యేడేళ్ళలో 170కు పైగా మరబోట్లను స్వాధీనం చేసుకుంది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం కనుగొనాలని, దెబ్బతిన్న మరబోట్లకు రాష్ట్ర ప్రభుత్వం సాయం చేసినట్టుగానే కేంద్రం కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని, కచ్చాదీవి ప్రాంతంలో చేపల వేటకు వెళ్లే జాలర్లకు ఎలాంటి సమస్య ఉత్పన్నంకాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జాలర్లు ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇందులో కేంద్రంతోపాటు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనకు జాలర్ల సంఘం అధ్యక్షుడు జేసురాజ్ సారథ్యం వహించగా, ఆ సంఘం కార్యకవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు. వీరితో పాటు డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ఖాదర్ బాషా, అఖిల భారత జాలర్ల కాంగ్రెస్ సంఘం అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో, కాంగ్రెస్ ఎంపీలు విజయ్ వసంత్, రాబర్ట్ బ్రూస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కరుమాణిక్యం, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ అసమర్థత వల్లే విద్యుత్ ఛార్జీల పెంపు

● పీఎంకే నేత అన్బుమణి ధ్వజం



ధర్నాలో నినాదాలు చేస్తున్న అన్బుమణి రాందాస్

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో, అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి లోక్‌సభ ఎన్నికల్లో, విక్రవాండి ఎన్నికల్లో గెలిచిన డీఎంకే ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందంటూ పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ధ్వజమెత్తారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఎగ్మూరు వద్ద శుక్రవారం ఉదయం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. డీఎంకే ప్రభుత్వానికి పరిపాలనా సామర్థ్యం లేదని, ముఖ్యమంత్రి స్టాలిన్ అసమర్థత కారణంగానే ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో విద్యుత్ ఉత్పత్తికి మంగళం పాడి, ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం సిగ్గుచేటని ఆయన ఆరోపించారు.

### పనిమయ మాతా చర్చి ఉత్సవాలు

● 5న తూత్తుకుడి జిల్లాకు సెలవు

ఐసిఎఫ్, జూలై 19: సెయింట్ పనిమయ మాతా చర్చి ఉత్సవాలను పురస్కరించుకొని తూత్తుకుడి జిల్లాకు ఆగస్టు 5వ తేదీ స్థానిక సెలవుగా జిల్లా కలెక్టర్ లక్ష్మీపతి ప్రకటించారు. ఈ జిల్లాలో వున్న ప్రసిద్ధిగాంచిన సెయింట్ పనిమయ మాతా ఆలయ ఉత్సవాలు ఆగస్టు 5వ తేదీ జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి తూత్తుకుడి ప్రత్యేక రైళ్లు, బస్సులు నడపనున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులు సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆ రోజు జిల్లాకు స్థానిక సెలవు ప్రకటించిన కలెక్టర్ ఆగస్టు 10వ తేదీన పనిదినంగా ప్రకటించారు.

### రెవెన్యూ కార్యదర్శికి అదనపు బాధ్యతలు



రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి అముద

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి అముదకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. హోంశాఖ కార్యదర్శిగా సేవలందించిన అముదను ఇటీవల రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అముదకు 'ముదల్వరిన్ ముగవరి' (ముఖ్యమంత్రి చిరునామా), 'మక్కలుడన్ ముదల్వర్' (ప్రజలతో ముఖ్యమంత్రి) పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కార విభాగం సేవలకు సంబంధించి ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వునిచ్చింది.

### ఆరోగ్యకేంద్రం, హాస్టళ్లలో కలెక్టర్ తనిఖీలు



హాస్టల్‌లో ఆహార పదార్థాల రుచి చూస్తున్న కలెక్టర్

వేలూరు, జూలై 19: 'ఉంగలై తేడి ఉంగల్ ఊరిల్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి కలెక్టర్ సుబ్బులక్ష్మి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఓటేరిలోని ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల సంక్షేమ హాస్టల్, టెక్నికల్ కళాశాల విద్యార్థుల హాస్టళ్లను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, ఆదిద్రావిడ సంక్షేమ హాస్టల్ ప్రాంగణంలో రూ.43లక్షలతో చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తొరప్పాడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్, స్కానింగ్ గది, ఇంజక్షన్ల విభాగం, ఈసీజీ, ప్రసవ వార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ మేయర్ సుజాత, మహిళ పథక డైరెక్టర్ నాగరాజన్, కార్పొరేషన్ కమిషనర్ రవిచంద్రన్, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సుకుమార్, కార్పొరేషన్ సంక్షేమ అధికారి గణేష్, వేలూరు తహసీల్దార్ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

### తూత్తుకుడి - మేట్టు పాళయం కొత్త రైలు సేవలు

ఐసిఎఫ్, జూలై 19: ప్రయాణీకుల విజ్ఞప్తి మేరకు వారానికి రెండుమార్లు తూత్తుకుడి - మేట్టుపాళయం మధ్య కొత్త రైలు సేవలకు రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. తూత్తుకుడి నుంచి గురు, శనివారాల్లో రాత్రి 10.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు మేట్టుపాళయం చేరుకుంటుంది. అదేవిధంగా తిరిగి అదే రైలు మేట్టుపాళయం నుంచి శుక్ర, ఆదివారాల్లో రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 4.20 గంటలకు తూత్తుకుడి చేరుకుంటుంది. ఈ రైలు కోవిల్‌పట్టి, సాత్తూర్, విరుదునగర్, మదురై, దిండుగల్, పొల్లాచ్చి, కోయంబత్తూరు స్టేషన్లలో ఆగనుంది.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

పెరంబూర్, జూలై 19: తంజావూరు జిల్లా పట్టుకోట సమీపం మధుకూర్ కీళకుర్చిలో బైక్, స్కూటర్ ఢీకొన్న ఘటనలో బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. రాధిక (30) తన కుమార్తె మోనీషా (9)తో కలసి శుక్రవారం మధ్యాహ్నం తల్లి ఇంటికి స్కూటర్‌పై బయల్దేరింది. కీళకుర్చి సమీపంలో వస్తున్న స్కూటర్‌ను ఎదురుగా విఘ్నేష్ (18) నడుపుతున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో మోనీషా, రాధిక, విఘ్నేష్‌లు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### ఆమ్‌స్ట్రాంగ్ హత్యపై సీబీఐ విచారణ జరపాలి

● బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి తమిళ్‌మది

ప్యారీస్,జూలై19: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుపై సీబీఐ విచారణ జరపాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమిళ్‌మది డిమాండ్ చేశారు. శుక్రవారం హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టరేట్ సమీపంలో నిర్వహించిన ధర్నాలో బీఎస్పీ, డీపీఐ, ఆర్పీఐ పార్టీల కార్యకర్తలు, లాయర్లు పాల్గొన్నారు. చెన్నై విభాగం ఆర్గనైజర్ ఇడుంబన్, హరిదాస్, అరిక్కల్ రాజ్, భాస్కర్, సమరన్, ముత్తరసన్ తదితరులు మాట్లాడుతూ... ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

### ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు సాయపడిన

## రౌడీ ముఠా ఆంధ్రాకు పరార్?

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు అన్ని విధాలా సాయపడిన ఉత్తర చెన్నై ప్రాంతానికి చెందిన రౌడీ ముఠా ఆంధ్రా పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్య ప్రతీకారంతో జరిగినట్లు నిర్ధారణ అవుతున్నా, తెరవెనుక కోట్లాది రూపాయల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లుగా పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ హత్యతో పుళియంతోపు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్లకు సంబంధం ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు రౌడీలు హంతకులకు వాహనాలు, ఆర్థిక సాయం చేసారని విచారణలో వెల్లడైంది. ఆ రౌడీలను గాలించేందుకు ఏర్పాటైన ప్రత్యేక పోలీసు బృందాలు రాష్ట్ర సరిహద్దుకు చేరువగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకు వెళ్ళాయి. ఈ హత్యకేసుతో సంబంధముండి ప్రస్తుతం పరారీలో ఉన్న ఉత్తర చెన్నై ప్రాంతానికి చెందిన అంజలైకి ఆంధ్రప్రదేశ్‌లో స్నేహితులున్నారని, వారిళ్లలోనే ఈ రౌడీలకు ఆశ్రయం కల్పించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా ప్రస్తుతం ప్రత్యేక దళం గాలిస్తోంది. ఇదే విధంగా ఈ కేసుతో సంబంధం ఉన్న పదికిమందికిపైగా లాయర్లను అదుపులోకి తీసుకునేందుకు కూడా పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

### పాఠశాలల మార్పిడికి టీసీలు అడగొద్దు

● విద్యాశాఖకు హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూలై 19: ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరే విద్యార్థుల నుంచి టీసీ అడగొద్దని రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు వెంటనే సర్క్యులర్ జారీచేయాల్సిందిగా పాఠశాల విద్యాశాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కరోనా విజృంభించిన రోజుల్లో ఫీజులు చెల్లించలేక ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మరో పాఠశాలల్లో చేరారు. ఇందుకోసం చదువుకున్న పాఠశాలల యజమాన్యాల నుంచి టీసీలు కోరగా, బాకీ ఫీజు చెల్లించే వరకు టీసీ ఇంచేందుకు అభ్యంతరాలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల విద్యాశాఖ టీసీలు లేకుండానే పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ స్వయం ప్రతిపత్తి పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో దాఖలైన పిటిషన్ మద్రాసు హైకోర్టులో శుక్రవారం విచారణకు వచ్చింది. ఇరుతరపు న్యాయవాదుల వాదన అనంతరం హైకోర్టు బెంచ్, ఇతర పాఠశాలల్లో చేరదలచుకున్న విద్యార్థులు చదువుకున్న పాఠశాలల్లో మళ్లీ టీసీకి దరఖాస్తు చేయాలని, వారంలోగా సంబంధిత విద్యార్థులకు టీసీలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు సర్క్యులర్ జారీచేయాలని, టీసీల పేరుతో విద్యార్థులను వేధించడం తగదని హైకోర్టు సూచించింది.

### నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్న ప్రాంతాల వివరాలు....

**అన్నాసాలై..** హైకోర్టు, తంబుచెట్టి వీధిలో కొంత భాగం, లింగిచెట్టి వీధిలో కొంత భాగం, మూర్ వీధిలో కొంత భాగం, అంగప్ప నాయకన్ వీధిలో కొంత భాగం, సెకండ్ లైన్ బీచ్‌రోడ్డులో కొంత భాగం, మూక్కర్ నల్లముత్తు వీధిలో కొంత భాగం, ఆర్మేనియన్ వీధిలో కొంత భాగం, నార్త్‌ఫోర్ట్ శాలైలో, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్డులో కొంత భాగం, ఫ్రాన్సిస్ వీధి, బేకర్ వీధి, స్ట్రింగర్ వీధి, మలైపెరుమాళ్ వీధి, భద్రి వీధి, బందరు వీధి, అండర్సన్ వీధి, ఇండియన్ బ్యాంక్ వీధి, హెచ్ఎస్‌బీసీ, జీసెస్ కాల్స్, స్టాక్ ఎక్స్చేంజ్, స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, క్యాథలిక్ సెంటర్, కురళగం, రాజా అన్నామలై మండ్రం, ఎల్ఐసీ, ఏఈజీఐఎస్, తమిళనాడు కో ఆపరేటివ్ కార్యాలయం, ఎస్ఐసీసీఐ, తమిళనాడు డెంటల్ కాలేజీ, చెన్నై మెడికల్ కాలేజీ బాయ్స్ హాస్టల్, చెన్నై హౌస్, లా కాలేజీ, ఎస్ప్లనేడ్ పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్ కార్యాలయ చుట్టుపక్కల ప్రాంతాలు, మన్నడి, జార్జ్‌టౌన్ చుట్టుపక్కల ప్రాంతాలు.

**వ్యాసర్పాడి:** ఓహెచ్‌బీ, తూర్పు కల్‌మండపం, పశ్చిమ కల్‌మండపం, ఎస్ఎన్ చెట్టి వీధి, ఎంఎస్ కోయిల్ వీధి, హుసేన్ మేస్త్రి వీధి, షేక్ మేస్త్రి వీధి, పశ్చిమ మాదా కోయిల్ వీధి, పకీర్ సాహెబ్ వీధి, బీవీ కోయిల్ వీధి, ఎస్ఆర్‌పీ రోడ్డు, ఈస్ట్ మాదా కోయిల్ వీధి, రైల్వే ప్రెస్, ముత్యాలపేట, ఫ్లగ్ వీధి, తంబు లేన్, మార్కెట్ లేన్, లోటస్ రామస్వామి వీధి, ఏజే కాలనీ, ఖాశిమా నగర్, జీవరత్నం క్వార్టర్స్, జీఎం పేట, కొత్త వన్నార్‌పేటలో కొంత భాగం.

**షోళింగనల్లూర్:** మేడంబాక్కం, మాంబాక్కం మెయిన్‌రోడ్డు, సాస్త్రా నగర్, వీరభద్రా నగర్, రాంగార్డెన్, కలైంజర్ నగర్, భవానీ అమ్మన్ కోయిల్ వీధి, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ క్వార్టర్స్, నెహ్రూ వీధి.

**అడయార్:** 3వ అవెన్యూ, బీసెంట్‌నగర్, 4వ మెయిన్‌రోడ్డు, 5వ అవెన్యూ, బీసెంట్‌నగర్ 32వ క్రాస్ వీధి నుంచి 35వ క్రాస్ వీధి వరకు, తిరువళ్లువర్ నగర్, ఉరువు కుప్పం, అడయార్ ప్రాంతంలోని 1వ మెయిన్‌రోడ్డు, గాంధీ నగర్, పాలవాక్కం, ఇందిరా నగర్, వెంకటేశపురం మెయిన్‌రోడ్డు, కనత్తుమేడు 1-4 వీధులు, స్వామినాథన్ నగర్ 1-11వ మెయిన్‌రోడ్డు వరకు, వివేకానంద 1, 2వీధులు, సెల్వరాజ్ అవెన్యూ, అవ్వై నగర్ మెయిన్‌రోడ్డు, గణపతి వీధి, పాండ్యన్ వీధి.

**ఐటీ కారిడార్:** పెరుంగుడి ఐటీ కారిడార్, దురైపాక్కం, నీలాంగరై, ఇండస్ట్రియల్, కందన్ చావడి, నెహ్రూ నగర్, పాలవాక్కం, ఉద్దండి, కసురా గార్డెన్, రంగారెడ్డి గార్డెన్, చిన్న నీలాంగరై కుప్పం, కపాలేశ్వర నగర్, దక్షిణ, ఉత్తర పాండ్యన్ రోడ్డు, వైద్యలింగన్ రోడ్డు, సీఎల్ఆర్ఐ నగర్, రూకే కాంప్లెక్స్, వెంకటేశ్వరా నగర్, ఓఎంఆర్, ఎళిన్ నగర్, పెరుంగుడి ఇండస్ట్రియల్ ఎస్టేట్, బర్మా కాలనీ, సీవరం ప్రాంతం కాల్వాయి పురం, బాల మురుగన్ గార్డెన్, సెక్రటేరియేట్ కాలనీ, నీలాంగరై లింకు రోడ్డు, కస్టమ్స్ కాలనీ, రాజీవ్‌గాంధీ రోడ్డు, హైస్టయిల్, ఫార్చ్యూన్ హోటల్, పంచాయతీ రోడ్డు, ఎళిన్ నగర్, సంతోష్ నగర్, పాల్‌రాజ్ నగర్, వీరమామునివర్ రోడ్డు, ఇళంగోనగర్, కామరాజర్ నగర్, గాంధీ వీధి, పెరియార్‌రోడ్డు, గోవిందానగర్, పాలవాక్కం కాలువ రోడ్డు.

**గిండి:** ఆలందూర్, ఎంకేఎన్ రోడ్డు, ఆసర్ఖానా, ఆలందూర్ మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్కెట్ సందు, జీఎస్‌టీ రోడ్డు, ఈశ్వరన్ కోయిల్ వీధి, మదురై వీధి, కరుణిగర్ వీధి, ఏరిక్కరై, ఆదంబాక్కం ప్రాంతం, శాంతినికేతన్ అపార్ట్‌మెంట్, క్రోవు అపార్ట్‌మెంట్, ముస్తాన్‌గోరీ అపార్ట్‌మెంట్, తిరువళ్లువర్ మెయిన్‌రోడ్డు, వేళచ్చేరి రోడ్డు, పొన్నియమ్మన్ కోయిల్ వీధి, ముత్తయ్యార్ రెడ్డి వీధి, కుప్పుస్వామి కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, కక్కన్ నగర్, ఎంజీవో కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, మన్నడియమ్మన్ కోయిల్ వీధి, పళనియమ్మన్ కోయిల్‌వీధి, రైస్‌కోస్ ప్రాంతం, అంబేద్కర్ నగర్, మడువాంగరై.

**పోరూర్:** కోవూర్, కుండ్రత్తూర్ మెయిన్‌రోడ్డు, పశ్చిమమాడవీధి, తూర్పు మాడవీధి, వెంకటేశ్వరా నగర్, ధర్మరాజా కోయిల్ వీధి, ఇందిరా నగర్, కోవూర్ కాలనీ, అంబాళ్ నగర్

**పల్లావరం:** ఇండస్ట్రియల్ అన్నాసాలై, మాపేపీ వీధి, అబ్దుల్ కలాం రోడ్డు, ముత్తు పళనియప్పన్ నగర్, సర్గుణం రోడ్డు, ఆదాం రోడ్డు.

### పర్యావరణంపై ఈసీవైసీ అవగాహన





ఎన్ చెన్నై యంగ్ చెన్నై మూడో ఎడిషన్ లోగో ఆవిష్కరిస్తున్న ఎంపీ శశికాంత్ సెంథిల్


చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల్లో ప్రత్యేకించి యువకులు, విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంచేలా ఎన్‌చెన్నై యంగ్ చెన్నై (ఈసీవైసీ) సంస్థ ఆధ్వర్యంలో 'ఫార్ ది లవ్ ఆఫ్ చెన్నై' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ మూడో ఎడిషన్ ఈవెంట్‌ను కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు శశికాంత్ సెంథిల్ ప్రారంభించారు. త్వరలో పాఠశాలల్లో చదివే చిన్నారులకు పోటీలు, సీనియర్ సిటిజన్లతో ప్లాస్టిక్ నిరోధక వాకథాన్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా యువ మేథావులను కూడా సత్కరించనున్నామన్నారు. సంస్థ వ్యవస్థాపకులు శంకర్, శివ్, వీ ప్రవీణ్, పీఎస్ కార్తిక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఉదయం 9.30గంటలకే అసెంబ్లీ సమావేశాలు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఇక మీదట ఉదయం 9.30 గంటలకే ప్రారంభమవుతుందని ప్రభుత్వం గెజిట్‌లో ప్రకటించింది. విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల కారణంగా శాసనసభ సమావేశాల ప్రారంభ సమయాన్ని ఉదయం 9.30 గంటలుగా నిర్ణయిస్తూ సభా నిబంధనల మండలి నిర్ణయించింది. ఆ మేరకు శాసనసభ నిబంధనల్లో మార్పు కూడా చేసింది. ఈ నిబంధన మార్పును ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఇకపై శాసనసభ సమావేశాలు ఉదయం 10 గంటలకు బదులుగా ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని స్పీకర్ అప్పావు ప్రకటించారు. గతంలో కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శాసనసభ సమావేశాలు ఉదయం 9.30 గంటలకే ప్రారంభించేవారు. ఆ పాత పద్ధతి మళ్ళీ ఇప్పుడు అమలులోకి రావటం విశేషం.

### యువతతోనే దేశాభివృద్ధి

● అమిటీ వర్సిటీ ఛాన్సలర్ సెల్వమూర్తి





విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న అమిటీ వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ సెల్వమూర్తి

చెన్నై, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): దేశంలో 60 శాతానికి పైగా ఉన్న యువకులే భారత భవిష్యత్ పదనిర్దేశకులని, వారితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చత్తీస్‌ఘడ్‌లోని అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ సెల్వమూర్తి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన శ్రీరామచంద్రా ఉన్నత విద్యా పరిశోధనా సంస్థ 37వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 780 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, పీజీ, యూజీ డిగ్రీలు, 38 స్వర్ణ పతకాలను ఆయన ప్రదానం చేశారు. ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్, ప్రో ఛాన్సలర్ ఆర్వీ సెంగుటువన్, ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి, వైద్యకళాశాల డీన్ డాక్టర్ కే బాలాజీ సింగ్, దంత వైద్యకళాశాల డీన్ డాక్టర్ హెచ్.తమిళ్‌సెల్వన్, పరిశోధనా విభాగం డీన్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ లీనా డెన్నీస్ జోసెఫ్, రిజిస్ట్రార్ రూపానారాయణన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఆర్.జ్యోతిమలర్ తదితరులు పాల్గొన్నారు.


అంబికా రాజ్

'మానవ సేవే మాధవసేవ'గా భావించి అంధులైన దివ్యాంగుల కోసం తన పదిహేడవ ఏట నుంచే సహాయం చేస్తున్నారు సైదాపేటకు చెందిన అంబికా రాజ్. నిరాశ్రయులైన వారి కోసం ఆమె 'అగల్ పౌండేషన్' అనే సంస్థ స్థాపించి పలు రకాల సహాయాలు చేస్తున్నారు. ముఖ్యంగా, అంధ విద్యార్థులకు పలు రకాల సహాయాలు చేస్తున్నారు. నిస్వార్థంగా సేలందిస్తున్న ఆమె నేటి మన తరుణి..

- పెరంబూర్



"సాధారణ విద్యార్థుల్లాగా ఉండదు అంధ విద్యార్థుల జీవనశైలి. వారు బ్రెయిలీ ద్వారా చదవవచ్చు కానీ, దానిని రాయలేరు. అందువల్ల పరీక్షల్లో కూడా వారికి ఇతరులు సాయపడాల్సివుంటుంది. సహాయకులు ప్రశ్నలు చదివి వినిపిస్తే వారిచ్చే సమాధానం సహాయకులు జవాబు పత్రాల్లో రాస్తారు. అలాంటి సమస్యలతో కూడినదే అంధుల లోకం" వారికోసం తన సేవా సంస్థ ఏ విధంగా ఏర్పడిందో చెప్పారు అంబికా రాజ్.





# అనాథులకు అండగా ఉంటూ..

# అంధులు, నిరాశ్రయులకు ఆసరా ఇస్తూ

● సమాజ సేవకురాలు అంబికా రాజ్

తరుణి

"మా స్వగ్రామం తంజావూరు. ఆర్థికస్తోమత లేని కారణంగా చిన్న వయస్సులో చదువు మాన్పించి వివాహం చేశారు. ఉన్నత చదువులు చదవాలనే ఆశ అంతటితో ఆగిపోయింది. కానీ, కుటుంబ పెద్దగా ఉండాలనే ఆసక్తి లేదు. జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యం మాత్రం మనస్సులో బలంగా ఉండేది. అలాంటి లక్ష్యం నుంచి ఆవిర్భవించిందే అగల్ ఫౌండేషన్.

" అంబికకు వివాహమై చెన్నై వచ్చిన తర్వాత అంధ విద్యార్థులకు చేయూత అందించాలని నిర్ణయించారు. వారు పరీక్షలు రాసేటప్పుడు సహాయకురాలిగా వ్యవహరించారు. ఆ సమయంలో వారితో ఏర్పడిన చనువు కారణంగా, జీవితంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు అర్థం చేసుకుని అప్పుడే వారి కోసం ఏదో ఒక సాయం చేయాలనుకున్నారు. ఒంటరిగా చేయలేమోనని భావించి, ఓ సంస్థ ఏర్పాటుచేసి దాని ద్వారా సహాయాలు అందించాలని నిర్ణయించుకొని 'అగల్ ఫౌండేషన్' స్థాపించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. నిరాశ్రయులైన దివ్యాంగులు, పేదరికంతో ఆదరణ లేని మహిళలకు చేతనైనంత సాయం చేస్తున్నారు.

ఎనిమిదేళ్లగా ఈ సంస్థ ద్వారా అంధులు, నిరాశ్రయులకు పలురకాల సహాయాలు అందజేస్తున్నారు. ఈ సంస్థలో సుమారు 1,000 మందికి పైగా వాలంటీర్లు పనిచేస్తున్నారు. అలాగే, అంధ విద్యార్థులకు సహాయకులుగా పరీక్షలు రాసేందుకు పలువురు ముందుకొస్తున్నారు. అలాగే, వారికి పుస్తకాలు చదివి వినిపించడం, సంగీత శిక్షణ, క్రీడలు తదితరాలు అందిస్తూ మానసికంగా వారు ఎదిగేందుకు తోడ్పడుతున్నారు. అగల్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అంధ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సహాయకులను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కొనేలా 2,500 ఆడియోతో కూడిన పుస్తకాలు తయారుచేసి అందిస్తున్నారు. ఆ ఆడియోలు వారు పదే పదే వినడం ద్వారా పాఠాలు బాగా అర్థమై పరీక్షలు సులభంగా రాసేందుకు ఉపయోగపడుతున్నాయి.

తమ వంతు కృషి చేస్తున్నా కానీ, సమాజం సహకారం అందిస్తే వారికి మరిన్ని సహాయాలు చేసేందుకు వీలుంటుందని అంబికా రాజ్ అంటున్నారు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న వారు కూడా ఇక్కడి నిరాశ్రయులను ఆదుకొనేందుకు ముందుకొస్తున్నారు. వారి సాయంతోనే ఆడియో పుస్తకాలు సిద్ధం చేస్తున్నాము. ప్రస్తుతం వారు పరీక్షలు రాసేందుకు సహాయకులు అవసరం ఉంది. 18 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వరకు ఉన్న వారెవరైనా సహాయకులుగా ఉండొచ్చు. అంధ విద్యార్థులతో పాటు వితంతువులు, ఆధారం లేని మహిళలు, హిజ్రాలు, ఆటిజం పిల్లలకు కూడా సహాయాలు అందజేస్తున్నాము. ఒక్కో కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరకులు కూడా అందిస్తున్నాము. కొవిడ్ సమయంలో పలువురికి వైద్య సహాయాలు కూడా అందించాము. ఇప్పటివరకు మా సంస్థ ద్వారా సుమారు రూ.90 లక్షల విలువైన పలురకాల సహాయాలు అందించామని అంబికారాజ్ చెబుతున్నారు.


అంధులకు నిత్యావసర సరుకుల పంపిణీ


దివ్యాంగ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహిస్తూ....

జీవితంలో అంధులకు ఎదురయ్యే సమస్యలు అనేకం. వాటిలో ప్రధానమైనది ఉపాధి అవకాశం. వారు ఉన్నత విద్య అభ్యసించినా, డాక్టర్ పట్టా పొందినా కూడా వారికి ఉద్యోగం లభించడం పెద్ద సవాలుగా మారింది. మరొకటి వివాహం. అలాంటి సమస్యలు తొలగిపోవాలంటే సమాజం కూడా వారిని గుర్తించి, గౌరవించి, సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందువల్లే అంధులు బిక్షగాళ్లుగాను, పాటలు పాడుతూ యాచన చేస్తుంటారు. అంధత్వాన్ని జయించి విద్య అభ్యసించినా ఉద్యోగాలు లేకపోవడంతో వారు మరింత క్రుంగిపోతున్నారు. అలాంటి వారికి చేయూతనందించేందుకు సమాజం ముందుకు రావాలి. బహిరంగ ప్రాంతాల్లో వారు కూర్చొనేందుకు వసతి, రైలు, బస్సుల్లో ఎక్కేందుకు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పలు పరీక్షలు ఎక్కువగా చెన్నైలోనే జరుగుతుంటాయి. పరీక్ష కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే అంధ విద్యార్థులకు తగిన బస ఏర్పాటుచేయలేకపోతున్నాము. ప్రైవేటు లాడ్జీల్లో మేమే డబ్బులు చెల్లించి వారికి బస, వసతి ఏర్పాటుచేస్తున్నాము. మా సంస్థ ద్వారా ఓ వసతి గృహం ఏర్పాటుచేయాలన్నదే తమ తదుపరి లక్ష్యం. అందుకోసం చర్యలు చేపడుతున్నాము. త్వరలోనే విడిదిగృహం ఏర్పాటుచేసి పరీక్షలు, సొంత పనుల కోసం వచ్చే అంధులకు ఉచితంగా బస వసతి కల్పించనున్నాము. వారికి కంటి చూపు మందగించినా, వారు వినే నైపుణ్యం, చేతులతో పనిచేయడం చేస్తుంటారు. అందుకోసం వారికి ఫుట్ మసాజ్ థెరపీలో శిక్షణ ఇచ్చి దాని ద్వారా వారు శాశ్వత ఉపాధి పొందేలా చర్యలు చేపడుతున్నాము. ఇంకా వారి ఉపాధికి ఎలాంటి చర్యలు చేపట్టాలో వాటిపై అధ్యయనం చేస్తున్నామని అంబికారాజ్ వెల్లడించారు. ఇదిలా వుండగా 'బెస్ట్ ఉమెన్ అచీవర్', 'భారతి కండ్ పుదుమై పెన్', 'వీరమంగై వేలు నాచియార్', 'అబ్దుల్ కలాం' పురస్కారం, 'సింగ పెన్' అనే పలు అవార్డులు అంబికా రాజ్‌ను వరించాయి.


అంధ విద్యార్థినికి చేయూత

**శారీరక లోపం కలిగిన దివ్యాంగుల పట్ల ప్రేమ, అభిమానం చూపించాలి తప్ప వారిని జాలిగా చూసే పరిస్థితి రాకూడదు. వారిలో కొందరు శారీరకంగా సక్రమంగా ఉన్న వారి కంటే అత్యంత ప్రతిభా పాటవాలు కలిగి ఉంటారు. అలాంటి వారికి ఒక్కసారి అవకాశం కల్పిస్తే మంచి స్థాయికి చేరుకుంటారు. అలాంటి వారి కోసం మనం కొంత సమయాన్ని వెచ్చిస్తే చాలు" అంటూ అంబికారాజ్ తరుణితో తన అనుభవాలను పంచుకున్నారు.**

చిత్రజ్యోతి


బాల

## చిరుత్తై శివ తమ్ముడికి వరుస అవకాశాలు

తమిళ చిత్ర దర్శకుడు చిరుత్తై శివ సోదరుడు బాలకు ఇటు తమిళంతో పాటు మలయాళంలోనూ వరుస అవకాశాలు వరిస్తున్నాయి. తమిళంలో అన్బు, కాదల్ కిసుకిసు, కళింగా, వీరం, తంబి, అన్నాత్త వంటి అనేక చిత్రాల్లో నటించిన బాల మలయాళంలో సూపర్‌స్టార్ మమ్ముట్టి వంటి అగ్రహీరోల చిత్రాల్లోనూ అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. తమిళంలో కేవలం క్యారెక్టర్ పాత్రలకే పరిమితమైన బాల మలయాళంలో మాత్రం హీరో, విలన్ పాత్రల్లో రాణిస్తున్నారు. అయితే, అనారోగ్యం కారణంగా ఒక యేడాది పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్నప్పటికీ... ఇపుడు మళ్ళీ వరుస చాన్సులు దక్కించుకుంటూ బిజీగా ఉన్నారు. ప్రముఖ తమిళ దర్శకుడు చిరుత్తై శివకు సోదరుడు కావడంతో ఆయనకు రెండు భాషా చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయని చెప్పొచ్చు.

## 'మహారాజ' దర్శకుడుకి విజయ్ ప్రశంసలు


విజయ్‌తో నితిలన్ స్వామినాథన్

'మహారాజ' చిత్ర దర్శకుడు నితిలన్ స్వామినాథన్‌ను అగ్ర హీరో విజయ్ అభినందించారు. విజయ్ సేతుపతి హీరోగా ఈ చిత్రాన్ని రూపొందించగా, ఘన విజయం సాధించింది. కలెక్షన్ల పరంగా రూ.100 కోట్ల మేర సాధించింది. ఈ నేపథ్యంలో నితిలన్‌ను హీరో విజయ్ తన నివాసానికి ఆహ్వానించి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విషయాన్ని నితిలన్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'మిమ్మల్ని కలిసేందుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. చాలా ఆనందంగా ఉంది. 'మహారాజ' గురించి మీరు చెప్పిన మరికొన్ని అంశాలు నన్ను కదిలించాయి. ఇది నాకు లభించిన గొప్ప అభినందనగా భావిస్తున్నాను. మీ ప్రేమ, మద్దతు, ప్రోత్సాహానికి చాలా ధన్యవాదాలు. లవ్ యూ అన్నా' అంటూ పేర్కొన్నారు.

## విఘ్నేష్ - మనీషా జష్నాని జంటగా 'రెడ్ ఫ్లవర్'

శ్రీకాళికాంబాల్ పిక్చర్స్ పతాకంపై కె.మాణిక్యం నిర్మించిన చిత్రం 'రెడ్ ఫ్లవర్'. విఘ్నేష్, మనీషా జష్నాని జంటగా నటించే ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి కథ సమకూర్చిన ఆండ్రూ పాండియన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి శుక్రవారం విడుదల చేశారు. ఈ రొమాంటిక్ పోస్టరులో విఘ్నేష్ లుక్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంది. కాంటెంపరరీ ఎలిమెంట్స్‌తో ఎల్లవేళలా ప్రేమనుపంచాలన్న కాన్సెప్టుతో భారీ బడ్జెట్‌తో యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. ఇతర పాత్రల్లో సీనియర్ నటులు నాజర్, వైజీ మహేంద్రన్, సురేష్ మేనన్, గోపి కన్నదాసన్, మోహన్ రామ్, డీఎం కార్తీక్, జాన్ విజయ్, అజయ్ రత్నం, లీలా శాంసన్, డీఎం కార్తీక్, తలైవాసన్ విజయ్ తదితరులు నటించారు.


'రెడ్ ఫ్లవర్'లో విఘ్నేష్ - మనీషా జష్నాని

## జీవితంలో కోలుకోలేని విషాదమే ఈ చిత్రం

● మారి సెల్వరాజ్



'నా వాస్తవిక జీవితంలో ప్రభావితం చేసిన అంశాలే ఈ సినిమా స్టోరీ. నన్ను మీరు పూర్తిగా అర్థం చేసుకునేందుకు తీసిన చిత్రం. ఇందులోని పాత్రలన్నీ నా జీవితంలో చూసినవి. ఆ పాత్రలన్నీ ఇప్పటికీ సంచరిస్తున్నాయి. నా జీవితంలో కోలుకోలేని విషాదమే 'వాళై' సినిమా అని ఆ చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ అన్నారు. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం 'వాళై'. ఇందులోని పాటల్లో ఫస్ట్ సింగిల్ నగరంలో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'తాను తొలిసారి దర్శకత్వం వహించాలనుకున్న చిత్రం 'వాళై'. రూ.50 లక్షలుంటే సినిమా తీయొచ్చన్న భావనలో చిన్న బడ్జెట్ చిత్రం. తన జీవితంపై తీవ్ర ప్రభావం చూపిన స్టోరీ. సమయం దొరికినపుడు మాత్రమే సెట్స్‌పైకి తీసుకెళ్ళాలని ఎంతో ఓపికతో ఉన్నాను. 'తొలుత 'పరియేరుం పెరుమాళ్' తీశాను. ఆ తర్వాత 'కర్ణన్', 'మామన్నన్' చిత్రాలను దర్శకత్వం వహించాను. 'వాళై' నా మనసుపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. అలా ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సినిమా తర్వాత పా.రంజిత్ నిర్మించే చిత్రంతో పాటు నిర్మాత కలైపులి ఎస్. థాను నిర్మించే చిత్రాలకు దర్శకత్వం వహిస్తాను. నా చిత్రాల్లో కనిపించే పాత్రలన్నీ నిజ జీవితంలో నేను చూసినవే. వారు ఇంకా జీవిస్తూనే ఉన్నారు. అందుకే ఆందోళనగా ఉంటుంది. సంతోష్ నారాయణన్ పాటలు చాలా బాగుంటాయి. ఈ సినిమా కోసం నటీనటులు ఎంతగానో శ్రమించారు. జీవితంలో కోలుకోలేని విషాదం నా భార్య దివ్య వియోగం. మీరు నన్ను అర్థం చేసుకునేందుకు మాత్రమే నిర్మించిన చిత్రం ఇది' అని పేర్కొన్నారు.


శుక్రవారం భారత సామాజిక న్యాయ సంఘం అధ్యక్షులు బిషప్ ఎస్రా సర్గుణం 86 జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు దురైమురుగన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియా డీపీఐ నేత తిరుమావళవన్ తదితరులు

## ముఖ్యమంత్రితో నెదర్లాండ్ రాయబారి భేటీ


చెన్నైలోని సచివాలయంలో శుక్రవారం సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నెదర్లాండ్ రాయబారి మేరీ లూయిసా జెరార్డ్స్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు. ఇన్‌సెట్‌లో శంకరనారాయణస్వామివారు

## శంకరన్‌కోవిల్‌లో నేత్రపర్వంగా ఆడితపస్ మహారథోత్సవం

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ శంకరనారాయణస్వామి ఆలయంలో ఆడి తపస్ మహా రథోత్సవం శుక్రవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. ఆ ఆలయంలో ఆడి తపస్ ఉత్సవాలు ఈ నెల 11న గోమతి అమ్మవారి సన్నిధి ముందున్న స్వర్ణధ్వజస్తంభంపై ధ్వజారోహణతో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాల్లో రోజూ అమ్మవారు వివిధ వాహనాల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా ఆలయ మండపం హాలులో ప్రతిరోజూ సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఎంపీ డాక్టర్ రాణి శ్రీకుమార్, తెన్‌కాశి జిల్లా కలెక్టర్ కమల్ కిషోర్, శాసనసభ్యుడు రాజా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమామహేశ్వరి తదితరులు రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవంలో మాజీ మంత్రి రాజలక్ష్మి, ఆలయ డిప్యూటీ కమిషనర్ గోమతి, మున్సిపల్ కమిషనర్ సభానాయగం, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ షణ్ముగయ్య తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ నాయకత్వంలో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఇక ఆడితపస్ దృశ్య వేడుకలను ఈ నెల 21న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకు దక్షిణ రథవీధిలో శంకరలింగస్వామి గోమతి అమ్మవారికి శంకరనారాయణుడిగా దర్శనమిచ్చే కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు వేదపండితులు నిర్వహించనున్నారు.

## ఆడి ప్రదోష, పౌర్ణమి వేడుకలు.. చదురగిరికి పోటెత్తిన భక్తులు


చదురగిరి కొండపైకి నడచివెళుతున్న భక్తులు

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆడి శుక్రవారం, ప్రదోషం, పౌర్ణమి వరుసగా రావడంతో విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపం పడమటి కనుమల పర్వతశ్రేణుల్లోని చదురగిరి సుందర మహాలింగం ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ప్రతినెలా పౌర్ణమి, అమావాస్య సందర్భంగా తలా మూడు రోజులు, ప్రదోషపూజల కోసం రెండు రోజులు చొప్పున ప్రతినెలా ఐదు రోజులపాటు చదురగిరి పర్వతంపై ఉన్న సుందర మహాలింగ స్వామివారిని దర్శించుకునేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతిస్తున్నారు. ఆ మేరకు శుక్రవారం ఆడి (ఆషాఢ) శుక్రవారం, ఆడి ప్రదోషం, పౌర్ణమి వరుసగా మూడు విశేష దినాలు రావటంతో ఈసారి చదురగిరి సుందర మహాలింగస్వామిని దర్శించేందుకు భక్తులను ఈ నెల 22 వరకు అంటే నాలుగురోజులపాటు అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు శుక్రవారం వేకువజామునే చదురగిరి పర్వతారోహణ ప్రారంభ ప్రాంతానికి చేరుకున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు ఉదయం 6.15 గంటలకు కొండ రహదారి మార్గాన్ని తెరచి భక్తులను అనుమతించారు. ప్రదోషం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుండి ఆరుగంటల దాకా సుందరమహాలింగస్వామివారికి భక్తులు అభిషేకాలు చేశారు. సుందర మహాలింగస్వామి ఆలయ ట్రస్టీ రాజా అలియాస్ పెరియసామి, ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణన్ భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఆడి పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో వారికి సదుపాయాలు కల్పించనున్నట్లు పెరియసామి తెలిపారు.

## 25 నుంచి 'ఓరల్ అండ్ మాక్సిలో ఫేషియల్ సర్జరీ'పై సదస్సు


విలేఖరుల సమావేశంలో నిర్వాహకులు

ట్రిప్లికేన్, జూలై 19: 'అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నందంబాక్కంలోని కన్వెన్షన్ సెంటర్‌లో 'ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ'పై అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. 22 ఏళ్ల తరువాత ఆసికా అంతర్జాతీయ సదస్సు మళ్లీ భారత్‌లో జరుగనుండడం విశేషం. ఈ వివరాలను అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గుణశీలన రాజన్ శుక్రవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో ఇంకా సంస్థ సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ వీబీ కృష్ణకుమార్ రాజా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జిమ్సన్, సీనియర్ సర్జన్లు డాక్టర్ ఎం.వీరబాహు, డాక్టర్ ఎన్.నందకుమార్, డాక్టర్ ఎలవెనిల్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ సమావేశం నోటి క్యాన్సర్‌తో సహా ముఖ శస్త్రచికిత్సకు సంబంధించిన క్లిష్టమైన అంశాలపై దృష్టి సారిస్తుందని నిపుణులు వివరించారు.

## చెరకు రసం తీసేందుకు పట్టభద్రులు కావలెను

● తూత్తుకుడిలో వెలిసిన ప్రకటన




చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'చెరకు రసం తీసేందుకు బీఏ, బీకాం, బీఎస్సీ ఏదేని డిగ్రీ చదివిన అభ్యర్థులు కావలెను. రూ.18 వేలు వేతనంగా ఇవ్వబడును" అంటూ తూత్తుకుడిలోని మెయిన్ యానాపురంలో ఓ వ్యాపారి పెట్టిన ప్రకటనా బోర్డు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఉదయం 8.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు పని చేయాల్సి వుంటుందని, 25 నుంచి 40 ఏళ్ల మధ్య వారై వుండాలని పేర్కొన్నారు. చెరకు రసం తీసేందుకు డిగ్రీ అభ్యర్థులు కావాలని కోరడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. సులభతరమైన పనికి ప్రజలు అలవాటు పడడంతో కష్టమైన పని చేసేందుకు కూలీలు దొరకడం లేదు. కష్టమైన పనికి అందరూ యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. ఈ కారణంగానే మెట్రోమార్గం తవ్వకాల వంటి కష్టమైన పనుల కోసం ఉత్తరాది నుంచి కూలీలను తరలించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే చెరకు రసం తీసేందుకు తగిన అభ్యర్థులు కావాలంటూ ఓ వ్యాపారి ఇలాంటి ప్రకటన వెలువరించాడంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.